# స్వాతి చినుకు

"మే ఐ కమిన్ సార్ ?"

చదువుతున్న బయోడేటా పేపర్స్‌లోంచి తలయెత్తి చూశాను.

"యస్"

హుందాగా నడుచుకుంటూ మా ఎదురుగా వచ్చి నిలబడ్డాడాయువకుడు. రెండు చేతులూ జోడించి, తల కొద్దిగా వంచి మా అందరికీ అభివాదం చేశాడు. పెదవుల మీద అవిశ్రాంతంగా కదలాడే అందమైన చిరులాస్యం.

"ప్లీజ్ టేక్ యువర్ సీట్ మిష్టర్ శ్రీహర్షా" అన్నాను.

ఇంటర్వ్యూ ప్రారంభించే ముందు సాధారణమైన ప్రశ్నలు వేయడం ఆనవాయితి. అది ఎదుటి వ్యక్తిని రిలాక్స్ చేసి తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా, స్పష్టంగా వెలిబుచ్చడానికి ప్రోత్సహిస్తుంది.

"మీరు గోల్డ్ మెడలిస్ట్ అన్మాట. గుడ్" మెచ్చుకోలుగా చూస్తూ అన్నాను.

ఆ లేత పెదవుల మధ్య సన్నటి చిర్నవ్వు కొద్దిగా విచ్చుకుంది. వినీలాకాశంలో రేకులు విచ్చుకునే ప్రాతః సంధ్యలా.

"యం.యస్సి ఎక్కడ చేశారు"?

"ఆంధ్రా యూనివర్శిటీ - విశాఖపట్నం"

"నేనూ అక్కడే చదివాను. పాతికేళ్ల క్రితం" నవ్వుతూ అన్నాను.

ఇక ప్రారంభించవచ్చన్నట్లు నా కుడివైపు కూచుని ఉన్న జైని గారివైపు చూశాను.

జైనికి ఆంధ్రరాష్ట్రం నించి వచ్చిన వాళ్లంటే సదవగాహన లేదు. తెలివిగల వాళ్లంతా ఉత్తర భారతదేశంలోనే ఉంటారని బలంగా, సిన్సియర్‌గా నమ్మే వ్యక్తి. అందుకే దక్షిణాది నించి వచ్చిన క్యాండిడేట్స్‌ని ముప్పుతిప్పలు పెట్టే ప్రశ్నలే అడుగుతాడు.

జైని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు.

శ్రీహర్ష వైపు చూశాను. నిశ్చలంగా జైని వైపు చూస్తూ అనర్గళంగా సమాధానాలిస్తున్నాడు. శ్రీహర్ష మొహంలోని ఆ అద్వితీయమైన చిర్నవ్వు మాత్రం చెదరలేదు. అతనిలో అనంతమైన ఆత్మవిశ్వాసం కన్పిస్తోంది. జైని అడిగే అతి కఠినమైన ప్రశ్నలకు సునాయాసంగా, అథారిటీతో సమాధానాలిస్తున్నాడు.

చాలా ముచ్చటేసింది. సెలక్షన్ విషయంలో ప్రాంతీయాభిమానం లేదనీ, చాలా నిష్పక్షపాతంగా ఉంటాననీ మంచి పేరుంది నాకు. అందుకే ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమీషన్ వారు నిర్వహించే జియో ఫిజిసిస్ట్ ఉద్యోగాల ఇంటర్వ్యూల్లో ఎక్కువ మార్లు నన్ను పిలుస్తుంటారు.

అయినప్పటికీ ఆంధ్రా వాళ్ళన్నా, అందునా ఆంధ్రా యూనివర్శిటీలో చదివిన వాళ్ళన్నా ఓ రకమైన అభిమానం నాకు. ఎటొచ్చీ ఆ అభిమానం, ఇష్టం మార్కులు వేసేటపుడు నా మీద ప్రభావం చూపకుండా జాగ్రత్త పడ్డాను.

జైని చేతులెత్తేశాడు. అతను దక్షిణాది వాళ్లకోసం ప్రత్యేకంగా దాచుకున్న మారణాస్త్రాలన్నీ వృథా అయినట్లు పేలవంగా మారిన అతని మొహమే చెప్తోంది.

నా ఎడం వైపు కూచున్న ఆర్కెదాస్ వైపు చూశాను. దాస్ చాలా నిక్కచ్చి అయిన మనిషి. ప్రెజన్స్ ఆఫ్ మైండ్‌నీ, సరియైన నిర్ణయాలు చేయగల సామర్థ్యాన్ని పరీక్షించే ప్రశ్నలే వేస్తాడు. అతనే ప్రశ్న వేసినా ప్రతి క్యాండిడేట్ కనీసం పావు నిముషమైనా ఆలోచించనిదే జవాబివ్వలేడు.

కానీ ప్రశ్న వచ్చీ రాకముందే శ్రీహర్ష నోటినుండి బులెట్‌లా సరియైన సమాధానం దూసుకు వస్తోంది.

అప్రతిహతుణ్ణై అలా చూస్తూ ఉండిపోయానతనివైపు.

నా వంతు వచ్చేప్పటికి నేనింకా ఆ ట్రాన్స్‌లోంచి బైటపడలేదు. ఏ ప్రశ్నా అడగాలనిపించలేదు. "థ్యాంక్స్ మిస్టర్ శ్రీహర్ష. మీరిక వెళ్ళవచ్చు" అన్నాను.

అతను లేచి నిలబడ్డాడు. ముకుళిత హస్తాల్తో 'నమస్తే' చెప్పి వెళ్ళిపోయాడు. అతని

మనోహరమైన చిర్నవ్వుని ఆ రూంలో వదిలివెళ్ళిన అనుభూతి నాకు.

మొట్టమొదటిసారి జైని కళ్లల్లో సంతృప్తి చూశాను.

"చాకులాంటి కుర్రవాడు" అన్నాడు జైని.

"వెరీ బ్రైట్ బాయ్" అన్నాడు దాస్.

శ్రీహర్ష లాంటి కొడుకు ఉండటం ఎంతటి అదృష్టమో. ఆ తల్లిదండ్రులు ఎంత గర్వపడతారో.

ఆ ఆలోచన రాగానే నెక్స్ట్ క్యాండిడేట్ బయోడేటా అందుకోబోతున్న నేను ఆగిపోయి మరలా శ్రీహర్ష బయోడేటా తీసుకున్నాను. ఫాదర్స్ నేమ్‌కి ఎదురుగా రాసి ఉన్న పేరు చూశాను. జీసస్ - జీసస్!

మరుక్షణం కాలం స్తంభించినట్లనిపించింది.

"శ్రీహర్ష తండ్రి పేరు "జీసస్" పెద్దగా అరిచినట్లు అన్నాను.

"మీకతను తెలుసా?" వింతగా నావైపు చూస్తున్న జైని, దాస్ ఒకేసారి అడిగారు.

"తెలియదు" చాలా స్థిరంగా జవాబిచ్చాను.

***

ట్రైన్ వేగంగా పోతోంది. నా మనసు అంతకన్నా వేగంగా గతంలోకి పరుగులు తీస్తోంది. ఎన్నేళ్ళ తరువాత విశాఖపట్నం పోతున్నానో తల్చుకుంటే చాలా ఉద్విగ్నంగా ఉంది. శ్రీహర్ష బయోడేటాలో నేను చూసిన అడ్రస్ మనసు మీద ముద్రించుకుపోయింది. ఆ పల్లెటూరి కెళ్ళాల్సిన అవసరం ఏమొచ్చిందో...

ఎన్నెన్ని తీయటి జ్ఞాపకాలో - నేను ఆంధ్రా యూనివర్శిటీలో జియోఫిజిక్స్ చదివే రోజుల్లో - అంటే దాదాపు పాతికేళ్ళ క్రింత - ఎన్నెన్ని స్మృతులో - విశాఖ సముద్రపు అలల్లా నిరంతరం నా మెదడుని ఢీకొంటూ...

***

"టైం తొమ్మిది కావస్తోంది త్వరగా లేవండి" రూమ్మేట్ పిలుపుతో లేచి కూచున్నా. తొమ్మిది కింకా అయిదునిముషాలుంది.

నా కలవాటయిన ఇన్‌స్టన్ట్ ముఖ ప్రక్షాళన కావించాను. రూంలోనే బకెట్‌లోంచి చేతిలోకి కొద్దిగా నీళ్ళు తీసుకుని, ఓ సారి పుక్కిలించి, మొహాన్ని తడిచేతుల్తో తుడుచుకోవడం

మెస్ హాస్టల్‌కి కొద్దిగా దూరంగా ఉంటుంది.

మెస్ దగ్గిరగా వచ్చి ఆగిపోయాను. ఎదురుగా వయ్యారంగా నడుస్తూ వస్తుందా అమ్మాయి.

సరిగ్గా ఇదే టయానికి ఈ దారంట వస్తూ ఉంటుంది.

రోజూ ఎనిమిది దాటాక నిద్రలేవటం ఎంత అలవాటో, తొమ్మిదింటికి మెస్ మెట్లు ఎక్కేముందు ఈవిణ్ణి చూడటం అంత అలవాటై పోయింది. దాదాపు ఓ సంవత్సరం నుంచీ ఇదే దినచర్య నాకు.

నన్ను దాటుకుంటూ వెళ్ళిపోయింది. ముగ్దలా తల వంచుకుని.

నల్లగా నిగనిగా మెరిసే కళ్ళు. బొద్దుగా కొద్దిగా పొట్టిగా ఉంటుంది. ఆ పెదవులు ఎప్పుడూ నవ్వుతో ఉన్నట్టు విచ్చుకుని ఉంటాయి. ఆ ముతక చీరలోంచి శరీరంలోని ఒంపులు కొట్టొచ్చినట్టు కన్పిస్తాయి. ఓ ఇరవయ్యేళ్ళుంటాయేమో - నెత్తిమీద ఓ తట్ట - నడకలో గండు శిలల్ని సైతం కవ్వించగల సెలయేటి హొయలు - కళ్ళలో కోటి కాంతిపుంజాల తళుకు -

అలానే నిలబడి తన నడకనే చూస్తున్నా! వెనక నుంచి లయబద్ధంగా పిరుదులు వూగుతున్నాయి. సహజంగానే అంత అందమైన నడకో లేక నన్ను చూసి కావాలని అలా నడుస్తుందో...

"ఎవరైనా చూస్తారండీ" ఈశ్వర్ భయం భయంగా అంటున్నాడు. ఈశ్వర్ నా రూమ్మేట్.

తను జూఆలజీ డిపార్ట్‌మెంట్ బిల్డింగ్ దాటింది. మరికొద్దిగా వెళితే రోడ్డు మలుపు తిరిగి తను నాకు కన్పించదు. అక్కడ ఆగి వెనక్కి తిరిగింది.

నాకు తెలుసు. అక్కడ అలా తిరుగుతుందని.

నేను నవ్వాను. తనూ నవ్వింది. నేను చేయి వూపాను. తనూ చేయి వూపింది. -

మరుక్షణం ఆ మలుపులో అదృశ్యమైంది.

"రోజా ఏమిటండీ - అందునా అలాంటి అలగా జాతితో" ఈశ్వర్‌కి కోపం. "ఏ కాలేజీ అమ్మాయినో ప్రేమించొచ్చుగా - యూనివర్శిటీలో అందమైన అమ్మాయిలకు కొదవేమైనా ఉందా?"

"ఇపుడీవిణ్ణి ప్రేమిస్తున్నానని చెప్పానా మీకు"

"మరి ఇలా తొమ్మిదింటికి పరుగెత్తుకు రావటం - ఇక్కడ ఆగి ఈ సైగలు - ఇవన్నీ దేనికి" అన్నాడు.

"నేను కన్పించకపోతే తన కళ్ళు నా కోసం వెతుక్కుంటాయన్న నమ్మకం - వాటిలో నిరాశని చూడలేని నా బలహీనత - అంత దూరం వెళ్ళి - అక్కడ ఆగి - వెనక్కి తిరిగి - నా నవ్వు కోసం రోడ్డంతా వెతుక్కుంటుందన్న వూహతో ఇలా పరుగెత్తుకుంటూ వస్తాను."

"పోనీ ప్రేమ కాకుండా కోరికేమైనా ఉంటే ఆవిడ్తో మాట్లాడి తీర్చుకోవచ్చుగా - అయినా మట్టిపని చేసే వాళ్ళని పొందడం కోసం ఇలా నెలల తరబడి సైగలు చేసుకోనవసరం లేదు.'

చిరాగ్గా చూశాను - ఈశ్వర్‌వైపు. ఎపుడర్థమౌతుంది ఈ మనుషులకు - ఆత్మగతమైన అనుబంధం లోని తీయదనం - మనసుకీ మనసుకీ మధ్య ఇచ్చిపుచ్చుకోవడంలో ఉన్న అద్వితీయమైన ఆనందం -

చెప్పినా తలకెక్కదు - అందుకే మౌనంగా మెస్‌లోకి నడిచాను.

☆☆☆

జియో ఫిజిక్స్ రెండో సంవత్సరం చదివేటపుడు మకాం కృష్ణదేవరాయ హాస్టల్‌కి మారింది. మెస్ హాస్టల్లోనే కావడం వల్ల ఆవిణ్ణి ఉదయాన్నే చూసే అవకాశం దొరికేది కాదు.

ఎపుడైనా క్లాసెస్ లేనపుడు యూనివర్శిటీ ప్రాంగణంలో స్నేహితుల్తో పిచ్చాపాటి మాట్లాడుతూ తిరిగేటప్పుడు అశాంతిగా వెదికేవాడిని ఎక్కడైనా కన్పిస్తుందేమోనని.

ఓ ఆదివారం వినయవిహార్ హాస్టల్ ఎదురుగా అకస్మాత్తుగా కన్పించింది. పక్కనించి పోతూ, ఓరకంటితో చూసి చిన్నగా నవ్వుకుంటూ...

"బావున్నావా" అన్నాను. తనకు మాత్రమే విన్పించేట్లు...

"వూ" అన్నట్లు తలవూపి వెళ్ళిపోయింది.

చాలా సంతోషం వేసింది. ఇన్నాళ్ళకు తను కన్పించినందుకు.

ఇంకేమైనా మాట్లాడాల్సింది. కానీ ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. చాన్నాళ్ళ తరువాత తనని చూశానన్న ఆనందంలో మాటలే రాలేదు నాకు.

తీరా మాటలు వెదుక్కున్నాక చూస్తే తను చాలా దూరం వెళ్ళిపోయింది.

"అయితే ఈ రోజు మీ బ్లాక్ డెవిల్ ప్రత్యక్షమైనందన్నమాట. ఎవరో రతీదేవి ప్రసన్నమైనట్టు ఏవిటండీ ఆ సంబరం?" ఎగతాళిగా నవ్వు.

"కృత్రిమత్వం నిండిన ఈ కాలేజి అమ్మాయిల కంటె తను వందరెట్లు నయం"

"హు... ఓ ఇరవై పడేస్తే ఈ రూంలో బట్టలిప్పుకుని నిలబడుతుంది దాని కోసం.."

"ప్లీజ్ ఈశ్వర్ .. అలా మాట్లాడకండి"

"నిజం... మీరు హర్ట్ అవుతారనే ఇన్నాళ్ళు చెప్పలేదు. తను వళ్ళమ్ముకు బతికే స్త్రీ - మనం హర్షవర్ధన హాస్టల్లో ఉన్నప్పుడు ఆ హాస్టల్‌కి ఎవరు పిల్చినా వెళ్ళేది కాదుట. ఇపుడు మనం ఉన్న హాస్టల్‌కి రావడం మానేసిందట. అందుకే చాన్నాళ్ళ వరకు దాని అసలు స్వరూపం తెలియలేదు. నాకూ ఈ మధ్యనే తెల్సింది."

ఈశ్వర్ గొంతులో నిజాయితీ ఉంది.

గుండెని ఎవరో పిండేస్తున్నట్లు బాధ. ఈ మనుషులూ... వీళ్ళ సంకుచిత మనస్తత్వాలూ.. ఛీ...

విసురుగా బైటికొచ్చాను. తను అలాంటిదని తెల్సిన బాధకంటే ఆ విషయం నాకు తెలీకూడదని తను పడ్డ తాపత్రయంలోని సిన్సియారిటీకి ఇష్టంతో పాటు, బాధ వేస్తుంది.

ఔటొగేట్ దగ్గర బస్ ఎక్కాను. ఎక్కడికెళ్తుందో కూడ చూడలేదు. అనంతమైన ఆలోచనలు.

దాదాపుగా రెండేళ్ళుగా అలవాటైన ఆ చిర్నవ్వు - చేయి వూపడం

"వళ్ళమ్ముకునే బజారు స్త్రీ" ట్రాష్ - కొనుక్కునే వీళ్ళు మాత్రం బజారు పురుషులు

కాదా?

బస్ మార్కెట్ దగ్గర ఆగింది. యధాలాపంగా అటు చూసిన నాకు ఆమె కన్పించింది. - బస్ దిగిపోయాను.

తను నన్ను చూసింది. నా దాకా తలవంచుకుని వచ్చింది.

మాట్లాడుకోకుండా - నిశ్శబ్దంగా - ఆ రోడ్డెంట - అలా నడుచుకుంటూ పోతున్నాం.

అలా ఎంతసేపో.. తల తిప్పి చూసాను. తను తల వంచుకుని ముగ్ధ మనోహరంగా నడుస్తోంది. ఆ నడక నాకెంతిష్టమో - వయ్యారంగా కొండ గుండెల మీద పాకే కన్నెవాగులా...

"ఇలా ఎందాకా" నేను అడిగాను.

"పక్కన మీరు నడుస్తుంటే అనంతం దాకా" ముసిముసిగా నవ్వుతోంది.

"చదువుకున్నావా"

"ఏం - కూలిపని చేసుకునేవాళ్ళు అలా మాట్లాడితే రుచించదా - కథల్లో రాసినట్లు నీతో యాడికైనా వస్తా అనాలేమో" పడీ పడీ నవ్వుతోంది.

అస్తమిస్తున్న సూర్యుడి నీరెండలో తళుక్కుమని మెరుస్తూ కదలాడే - రెండు కళ్ళు ప్రేమగా - ఆరాధనగా - ఇష్టంగా చూస్తున్నాయి నావైపు.

"ఇంతకూ ఎందాకా చదివావు?"

"చదువులూ, డిగ్రీలు ఉంటేనే కాని మాట్లాడరా ఏమిటి? నేను మీలా పెద్దగా ఏమీ చదువుకోలేదు. జీవితాన్ని, మనుషుల్ని చదివినజ్ఞానమే - ఏదో కొద్దిగా -"

లక్ష్మి థియేటర్‌కి దగ్గరగా వచ్చాం.

"సినిమా కెళ్దామా" అన్నాను. చిరుకోపంగా చూసింది.

"సినిమాలూ, పార్కులూ తప్ప మీకేమీ తోచదా - రెండు సంవత్సరాల తరువాత - ఇప్పటికి మీతో మాట్లాడే భాగ్యం దొరికింది. మా ఇంటికెళ్ళి కూచుని హాయిగా కబుర్లు చెప్పుకుందాం"

కాదనలేకపోయాను. ఇల్లు యూనివర్శిటీకి దగ్గర్లోనే ఉంది. తాటాకులు కప్పిన మట్టిఇల్లు.

ఇంట్లో ఇద్దరు ముసలివాళ్ళున్నారు.

"మా అమ్మ నాన్నలకు నేనొక్కతినే.. ఈ వయసులో వాళ్ళకు ఏ కష్టమూ రాకూడదనే నా తాపత్రయం."

అలా ఏలోటూ రానివ్వటం లేదన్న సంతృప్తి ఆ కళ్ళలో కన్పించింది. పేద తల్లిదండ్రుల నుంచి తమ సరదాల కోసం డబ్బుని పిండే యూనివర్శిటీ లోని కొంతమంది కుర్రవాళ్ళకూ ఈమెకూ ఎంత వ్యత్యాసం!

అప్పటినుండీ సాయంత్రాలు ఎక్కువగా తన ఇంటికి వెళ్ళే వాడిని. సాహిత్యం, సంగీతం, పాలిటిక్స్, సినిమాలు, మనస్తత్వ శాస్త్రం ఇలా ఏ టాపిక్ మీదైనా అనర్గళంగా మాట్లాడగలదు తను.

అలా మాట్లాడుతున్నపుడు తదేకంగా ఆమెవైపు చూస్తూ ఉండాలనిపించేది. ఆ నల్లటి బుగ్గల్లో నిగారింపు - కళ్ళ కదిలికలోని సింగారం - అతి నిపుణుడైన శిల్పి నల్లరాతితో మలిచిన అపూర్వ స్త్రీ శిల్పంలా ...

"పర్మినెంట్‌గా ఉంచుకున్నాడేమో"

చాలామంది అనుకుంటుండగా విన్నాన్నేను. స్త్రీలంటే ఎంతటి చులకన భావం! అందులో తమకు ఎటువంటి భాగస్వామ్యమూ లేనట్లు ఎంతటి ఆత్మవంచన!

ఓసారి తనను అడిగాను. "పెళ్లెందుకు చేసుకోవూ" అని.

"నన్నెవడు చేసుకుంటాడు? అథవా చేసుకున్నా మా అమ్మా నాన్నల సంగతేంకాను" అంది. నా కళ్ళలోకి చూస్తూ దేనికోసమో వెతుక్కుంటోంది.

"ఓ మాటడగనా - రోజూ కూలిపని కెళ్తావు కదా - ఆ వచ్చిన డబ్బు మీకు తప్పకుండా సరిపోతుంది. మరి-నువ్వలా- హాస్టల్లో..." ఎలా అడగాలో తెలియలేదు. ఇబ్బందిగా, బాధగా ఉంది.

ఒకే ఒక్క క్షణం తన కళ్ళలో భయం కన్పించింది. ఆ వెంటనే సర్దుకుని మామూలుగా నవ్వేస్తూ "నాకు తెలుసు - మీకా విషయం తెలిసే ఉంటుందని. రోజూ కూలిపని దొరికితే ఇంకేం"

"నాకు ప్రతిరోజూ ఉదయం కన్పించేదానివిగా"

పెద్దగా నవ్వింది. తన టిపికల్ నవ్వు. విశాఖ సముద్రం మీద సయ్యాటలాడే ప్రాతః సంధ్య అందులో...

" ఆమాత్రం అర్థం చేసుకోలేరా - మిమ్మల్ని చూడాలనే బలమైన కోరికతో పనున్నా లేకున్నా ప్రతిరోజూ వచ్చేదాన్ని" కళ్ళనిండా ఆరాధన.

మాకు మూడో సంవత్సరంలో నెలకు నాలుగు వందలు స్కాలర్ షిప్ వస్తుంది. అది మెస్‌కి కట్టే బదులు తనకే ఇచ్చేస్తే బావుంటుంది కదా - అదే చెప్పాను. .. కష్టమో నష్టమో మరెప్పుడూ శరీరాన్ని తాకట్టు పెట్టవద్దని -

"మీరు మాతో పాటు ఉండి - పచ్చడి మెతుకులు తింటారా. మీరు ఉండగలరా - మీ స్నేహితులేం అనుకుంటారు" లాంటి సవాలక్ష ప్రశ్నలూ - భయమూ. చివరకి "నేనీ సంఘాన్ని పట్టించుకోను. నాకు మీ గురించే భయం" అంది.

చాలా సర్ది చెప్పాక ఒప్పుకుంది. మకాం తనింటికి మారిపోయింది. నాకొచ్చే నాలుగు వందలు తనకిచ్చేవాడిని. తనకు కూలిపని ఉన్నప్పుడు ఉదయం యూనివర్శిటీ వరకూ నడుచుకుంటూ - బోల్డు కబుర్లు చెప్పకుంటూ వెళ్ళే వాళ్లం. రాత్రుళ్లు నేను చదువుకుంటుంటే నా దగ్గరే కూచునేది. నావైపే చూస్తూ...

"నిద్రపోకూడదా" అంటే "మీరు మేల్కొని చదువుకుంటుంటే నాకు నిద్రెలా వస్తుంది" అనేది. నాకు అన్నీ సౌకర్యంగా ఉండాలని ఎక్కువ కష్టపడేది.

"ఎందుకలా వళ్ళు హూనం చేసుకుంటావు" అంటే వినేది కాదు.

నా ప్రతి అవసరాన్ని శ్రద్ధగా గమనించేది. అనాథగా పెరిగి కొందరి దయతో, స్కాలర్‌షిప్‌తో చదువు సాగించిన నాకు ఆత్మీయత అందించిన ఆమె మీద ఇష్టంతో పాటు ప్రేమ కూడా కలిగేది.

యూనివర్శిటీ ఫస్ట్ వచ్చినపుడు "నీ శ్రద్ధాసక్తులూ - సేవల కారణంగానే" అంటే కళ్ళనిండా నీళ్ళు నింపుకుని "నాకోసం మీరు పడిన అవమానాలూ - చేసిన త్యాగాలూ వీటితో పోలిస్తే అదెంత? మీలాంటి ఉన్నతమైన వ్యక్తి కోసం..."

ఎన్నిసార్లంటుందో అలా.. ఏవిటీ ఉన్నతత్వం అంటే - నా ఉద్దేశంలో తనే ఉన్నతురాలు - అమలినమైన మనసు - స్నేహభావం - నిస్వార్థసేవ - ఇవే మనిషికి ఉన్నతత్వం ఆపాదించేవి.

రూర్కి యూనివర్శిటీలో రీసెర్చి చేయడానికి వెళ్ళే ముందనుకుంటాను ఓసారి హఠాత్తుగా అంది "మిమ్మల్ని జీసస్ అని పిలుస్తాను" అని.

ఆశ్చర్యంగా "అదేం పేరు" అంటే

"జీసస్ పాపుల కోసం శిలువ మోసాడు. మీరు నా కోసం..."

"నువ్వు పాపాలేం చేయలేదు. అలా పోల్చుకోవడానికి"

"ఎందుకు చేయలేదూ! నా వృత్తి విషయంలో కడుపుకోసమని సమాధానం చెప్పుకున్నా - కడుపులో పెరిగే పసికందుని - అబార్షన్ పేరిట రెండుసార్లు .. ఎంతటి రంపపు కోత... నా కెంతిష్టమో పిల్లలంటే - వాళ్ళ గొంతు నులిమి చంపేస్తున్నామన్న పాపభీతి..." వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"నీకంత ఇష్టమైనపుడు ఉంచుకోవచ్చుగా. ఈ సంఘాన్ని పట్టించుకోనని చెప్తుంటావుగా".

"సంఘం కోసం కాదండీ. వాడు పెరిగాక తండ్రి ఎవరని అడిగితే ఏమని చెప్పాలో తెలీక"

"తండ్రి జీసస్ అని చెప్పు" తన వైపు ప్రేమగా చూస్తూ అన్నాను.

ఆమె కళ్ళలో నీళ్ళు - పాదాలు పట్టుకుని చెప్పింది "నిజంగా మీరు జీససే" అని. ఆమెలో నా మీద అంతులేని ఆరాధన - పూజ్యభావం.

నేను రూర్కి వెళ్ళాక ఉత్తరాలు వచ్చేవి కావు. చాలా ఆరాట పడేవాడిని. ప్రతి క్షణం తన నవ్వూ - మాటలూ - మంచితనం - సపర్యలూ అన్ని గుర్తొచ్చేవి. అంతులేని అశాంతికి లోనయ్యేవాడిని. ఇక ఉండబట్టలేక ఓసారి వైజాగ్ వెళ్ళాను. తను ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయిందని చెప్పారు. ఎక్కడికెళ్ళిందో ఎవరూ చెప్పలేకపోయారు. నాలుగు రోజులు పిచ్చివాడికి మల్లే విశాఖ రోడ్లన్నీ తిరిగాను. మనుషుల్ని, ముఖాల్ని - మనసుల్ని వెతుక్కుంటూ.... తను కన్పించలేదు.. అలా ఎందుకు చేసిందో - నా నుంచి పారిపోవాల్సిన అవసరం ఏమొచ్చిందో ఇప్పటికీ అర్థం కాదు. హతాశుడినై - ఆశ వదులుకుని రూర్కి వెళ్ళిపోయాను. కొన్నాళ్ళు

అజ్ఞాపకాలు బాధించేవి. ఇపుడు ఇన్ని సంవత్సరాల తరువాత - మరలా తనని కల్సుకోబోతున్నాను.

★★★

వైజాగ్ చేరుకున్నాక మరోసారి శ్రీహర్ష అడ్రస్‌ని మననం చేసుకున్నాను.

పోలిపల్లి గ్రామం - వయా తగరపువలస. అది శ్రీకాకుళం వెళ్ళే దారిలో ఉంటుందని చెప్పారు. బస్ ఎక్కిన క్షణం నుంచీ చాలా ఎగ్జయిటింగ్‌గా ఉంది. పాతికేళ్ళ తరువాత తనను చూడబోతున్నాను. వయసు పైబడిన నా హృదయం అంతటి ఆనందాన్ని తట్టుకోగలుగుతుందో లేదో - ఇంతకూ నేను పొరబడలేదు కదా. జీసస్ అనే పేరు ఎవరికయినా ఉండొచ్చు కదా.. కానీ శ్రీహర్ష.. నా కిష్టమైన పేరు. ఆ వాగ్ధాటి - ఆ తెలివి - హుందాతనం - అచ్చం తనలా నవ్వటం - లేదు. నేను పొరబడటానికి ఆస్కారం లేదు.

"పోలిపల్లి" అని కండక్టర్ అరిచిన అరుపుకి ఆలోచనల్లోంచి బైటపడి బస్ దిగాను. అక్కడో చిన్న టీ దుకాణం ఉంది. దానికి ఎదురుగా ఓ మట్టిరోడ్డుంది. ఓ ఫర్లాంగు దూరం నడిచాక కన్పించింది ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ శాఖ. శ్రీహర్ష ఇచ్చిన కేరాఫ్ అడ్రస్ ఇదే.

"మేనేజర్' అని రాసి ఉన్న రూంలోకి వెళ్ళాను. పొట్టిగా, నల్లగా, బట్టతలతో ఉన్న వ్యక్తి ఏదో రాసుకుంటున్నాడు. విష్ చేసి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. శ్రీహర్ష గురించి అడిగాను. మెసింజర్‌ని పిలిచి నాకు ఇల్లు చూపించమని చెప్పాడు.

మెసింజర్ చూపించిన ఇంటివైపు నడిచాను. నా గుండె బలంగా కొట్టుకోవడం విన్పిస్తూనే ఉంది.

లోపల ఓ స్టూల్ మీద శ్రీహర్ష కూచుని ఉన్నాడు. కింద ఓ ఇరవైమంది చిన్నపిల్లలు కూచుని చదువుకుంటున్నారు. శ్రీహర్ష నన్ను చూడగానే హర్షాతిరేకంతో నాకు ఎదురొచ్చి నమస్కరించాడు. నాకు చాలా టెన్షన్‌గా ఉంది. అది ఒకే ఒక గది. గదంతా కలియచూశాను. తను లేదు.

శ్రీహర్ష ఆ పిల్లల్ని పంపించేశాక అన్నాడు "మీరు తప్పకుండా వస్తారని నాకు తెలుసు".

శ్రీహర్ష ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు. ఇక ఉండబట్టలేక అడిగాను 'అమ్మేది' అని.

ఓ క్షణం నిశ్చలంగా నావైపు చూశాడు శ్రీహర్ష.

అతని పుస్తకాలు వెదికి ఓ కవర్ తెచ్చి నా చేతిలో పెట్టాడు.సీల్ చేసిన కవరది.

"ఇదేమిటీ" అని అడిగాను - వణికే కంఠంతో - జవాబు కోసం ఆగకుండా కవర్ చింపి ఉత్తరం బయటకు తీశాను.

"జీసస్ - ఎన్నాళ్ళ తర్వాత ఇలా పిలిచే అదృష్టం దొరికింది నాకు! మీరు రూర్కి వెళ్ళేవుందే మీ ప్రేమనీ - అంతర్యాన్నీ అర్థం చేసుకున్నాను. నా కోసం మీరు ఏవేవో త్యాగాలు చేసి, మీ విలువైన జీవితాన్ని వృధా చేసుకోవడం ఇష్టం లేక మీకు దూరంగా వెళ్ళిపోయాను. నాతోపాటు మీ స్నేహాన్ని, మంచితనాన్ని, ఔన్నత్యాన్ని, ఆశయాల్ని తీసు కెళ్ళాను. అవే ఇన్నాళ్ళూ నా వూపిరి. నేనెక్కడ ఉన్నా ప్రతిక్షణం మీ గురించి తెలుసుకుంటూనే ఉన్నాను. ఈ పొలిపల్లిలో వ్యవసాయపు పనులు చేసుకుంటూ నా కొడుకుని పెంచాను. బ్యాంక్ తెరిచాక అందులో మెయిడ్ సర్వెంట్‌గా చేరాను. ఏం చేసినా నా కొడుకుని మీ అభిప్రాయాలకు, ఆదర్శాలకు అనుగుణంగా పెంచానన్న తృప్తి నాకుంది. మీరు అన్నట్లే వీడి తండ్రి పేరు జీసస్. నా కొడుకుని మీ అంతవాడిని చేస్తారన్న నమ్మకంతో ప్రశాంతంగా వెళ్ళిపోతున్నాను. రోజురోజుకూ పెరుగుతున్న ఈ అనారోగ్యంతో ఎక్కువ కాలం బ్రతుకుతానన్న నమ్మకం లేదు. ఎప్పటికైనా శ్రీహర్ష ద్వారా నన్ను వెతుక్కుంటూ వస్తారన్న ఆశతో మీ కోసం ఈ ఉత్తరం రాస్తున్నాను. మీ స్నేహ మాధుర్యంలో తడిసి పునీతమైన నా జీవితం మీకే అంకితం చేశాను. జీవితంలో మీరు మిగిల్చిన తీపి అనుభూతులు- మధురమైన జ్ఞాపకాలు- అందుకు ఎన్నటికీ మీకు కృతజ్ఞురాలిని. మీరు పక్కన లేకున్నా అనంతందాకా వెళ్ళిపోతున్నాను. మన్నిస్తారుగా -

ఉత్తరం పూర్తిచేసి తలయెత్తి చూశాను. నా కళ్ళనిండా నీళ్ళు.....

● *ఆంధ్రభూమి వారపత్రిక 4, మే 1995* ●